సాక్షి ప్రకాశం

శుక్రవారం । 2 । ఫిబ్రవరి । 2024



మహిళల సంక్షేమమే జగనన్న ధ్యేయం

జగనన్నను మళ్లీ సీఎం చేసేందుకు మహిళలు కలిసికట్టుగా పనిచేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. - IIలో..



ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా వార్డెన్లు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి ఎస్.లక్ష్మానాయక్ ఆదేశించారు. - IIలో..

గరిష్టం/కనిష్టం
31/23

వాతావరణం

ఉదయం పొగమంచు అధికంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా

- బాధ్యతలు స్వీకరించిన జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: అధికార యంత్రాంగం, ప్రజలను కలుపుకుని సమన్వయంతో పనిచేసి జిల్లా అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేస్తానని కొత్తగా బాధ్యతలు చేపట్టిన జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ అన్నారు. 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన గోపాలకృష్ణ సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్సు అడిషనల్ డైరెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన గురువారం ప్రకాశం భవనంలో జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తనకు అప్పగించిన బాధ్యతలను, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బాధ్యతలు స్వీకరించిన జాయింట్ కలెక్టర్‌కు డీఆర్‌ఓ శ్రీలత, ఒంగోలు ఆర్‌డీఓ విశ్వేశ్వరరావుతో పాటు కలెక్టరేట్ సిబ్బంది, జాయింట్ కలెక్టర్ పేషీ సిబ్బంది, జిల్లా అధికారులు, ఉద్యోగ సంఘాల కలిసి అభినందనలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించారు.

మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాజమన్నార్



డాక్టర్ రాజమన్నార్

మార్కాపురం: మార్కాపురం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాజమన్నార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రాజమహేంద్రవరం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. రాష్ట్ర అదనపు డీఎంఈ (డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్)గా కూడా ఆయన విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఒంగోలు రిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా 8 ఏళ్ల పాటు పనిచేశారు. ఈ సందర్భంగా రాజమన్నార్ మాట్లాడుతూ మార్కాపురం ప్రాంతం తనకు చిరపరిచితమని, మెడికల్ కళాశాల పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు.

కమిషనర్‌గా జస్వంతరావు బాధ్యతల స్వీకరణ



మేయర్ గంగాడ సుజాతను కలిసి మొక్క అందజేస్తున్న నూతన కమిషనర్ జస్వంతరావు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఎం.జస్వంతరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ వద్ద బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన నగర మేయర్ గంగాడ సుజాతను మర్యాదపూర్వకంగా కలిశారు. మేయర్‌కు మొక్కను బహూకరించారు. జస్వంతరావు గుంటూరు జిల్లా తెనాలి నగరపాలక సంస్థ కమిషనర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. రానున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సొంత జిల్లాల్లో పనిచేస్తున్న వారిని బదిలీ చేశారు. అందులో భాగంగా ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వరరావును ఎన్టీఆర్ కృష్ణా జిల్లా తాడిగడప మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. జస్వంతరావు 1992లో గ్రూపు–2 ద్వారా ఎంపికయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ డైరెక్టరేట్ కార్యాలయంలో పనిచేశారు. అనంతరం పొన్నూరులో ఐదు సంవత్సరాల 10 నెలల కమిషనర్‌గా పనిచేశారు. ప్రస్తుతం తెనాలిలో కూడా నాలుగు సంవత్సరాల ఆరు నెలలుగా కమిషనర్‌గా పనిచేస్తూ ఎన్నికల నేపథ్యంలో ఇక్కడకు బదిలీ అయ్యారు.

రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశం వాయిదా

ఒంగోలు సెంట్రల్: సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నేడు జరగాల్సిన రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఆ శాఖ డీడీ ఎస్.లక్ష్మానాయక్ తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో జరగాల్సిన ఈ సమీక్ష సమావేశం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విజయీభవ

ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా జిల్లా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. వందశాతం లక్ష్యసాధనకు ప్రణాళికలు రూపొందించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచి పరీక్షలకు పూర్తి స్థాయిలో సన్నద్ధం చేస్తున్నారు. జయీభవ సంకల్ప పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. గతేడాది డిసెంబర్ 14న ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈ నెల 24వ తేదీ వరకు జరగనుంది. పరీక్షలంటే విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టడంతో పాటు సబ్జెక్టుల వారీగా మెరుగైన శిక్షణ ఇస్తున్నారు.

- ఇంటర్‌లో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం
- జయీభవ..సంకల్ప ద్వారా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ
- వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి
- మొదటి, ద్వితీయ సంవత్సరాల్లో 44,733 మంది విద్యార్థులు
- జనరల్ విద్యార్థులకు 93 పరీక్ష కేంద్రాలు
- ఒకేషనల్‌కు 46 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు



పరీక్షలకు సిద్ధమవుతున్న ఇంటర్ విద్యార్థులు

మార్కాపురం: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మంచి ఫలితాలు సాధించేందుకు జిల్లా ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు, అధ్యాపకులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. మొదటి, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి 44,733 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. జనరల్ విద్యార్థులకు 93 పరీక్ష కేంద్రాలు, ఒకేషనల్‌కు 46 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 21570, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 23163 విద్యార్థులు ఉన్నారు. మార్చి 1వ తేదీ నుంచి 19వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. మార్చి 1, 4, 6, 9, 12, 14, 16, 19 తేదీల్లో మొదటి, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి ఇంగ్లిష్, మ్యాథ్స్, బొటనీ, జువాలజీ, హిస్టరీ, సివిక్స్, ఫిజిక్స్, ఎకానమీ, కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్‌ఆర్ట్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, జాగ్రఫీ తదితర పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకూ పరీక్షలను నిర్వహించనున్నారు. గత సంవత్సరం ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 20,717 మంది విద్యార్థులు హాజరుకాగా 14,477 మంది ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరంలో 23,780 మందికి గాను 12,104 మంది పాసయ్యారు. ఈ దఫా ఇందుకు మెరుగైన ఫలితాలు సాధించేలా అధికారులు దృష్టిసారించారు.

ప్రాక్టికల్స్‌కు సిద్ధం..

ఇంటర్ రెగ్యులర్, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి 20 వరకూ ఒకేషనల్ కోర్సులకు సంబంధించి మూడు విడతల్లో ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వీటిని నిర్వహిస్తారు. ఇందులో మొదటి సంవత్సరంలో 2,395 మంది, రెండో సంవత్సరంలో 2,501 మంది హాజరుకానున్నారు. ఇక రెగ్యులర్ సైన్స్ విద్యార్థులకు ఈ నెల 11వ నుంచి 20 వరకూ రెండు విడతల్లో ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా 13,827 మంది విద్యార్థులు సైన్సు ప్రాక్టికల్స్ పరీక్షకు హాజరవుతున్నారు. ఈ నెల 2వ తేదీన ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు నైతికత, మానవ విలువలపై, 3న పర్యావరణ విద్యపై పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ రెండు పరీక్షలు ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు తప్పనిసరిగా రాయాల్సి ఉంది. ఈ రెండు పరీక్షలు రాసి అర్హత పొందితేనే ఇంటర్మీడియెట్ పాస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. గతంలో పాత విద్యార్థులు ఎవరైనా ఈ పరీక్షలు రాయకుంటే ఇప్పుడు రాయవచ్చు.

ఉత్తమ ఫలితాలు సాధనే లక్ష్యంగా..

ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమ కళాశాల, స్కూల్ ప్లస్, కేజీబీవీల్లో ఇంటర్మీడియెట్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆధ్వర్యంలో జయీభవ సంకల్ప కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గత ఏడాది డిసెంబర్ 14 నుంచి ఈ నెల 24 వరకూ మొత్తం 50 రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతోంది. ప్రతి సబ్జెక్టును రివిజన్ చేయడం, అలాగే అత్యంత ప్రాముఖ్యమైన ప్రశ్నలపై విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారు పాఠ్యాంశాలపై పట్టు సాధించేలా చేస్తున్నారు. అలాగే మంచి మార్కులతో పాసయ్యేలా తర్ఫీదునిస్తున్నారు. ప్రత్యేక స్టడీ అవర్స్, అంతర్గతంగా పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు.



పక్కా ఏర్పాట్లు..

ప్రశాంత వాతావరణంలో ఇంటర్ పరీక్షలు నిర్వహించేందుకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రాక్టికల్, థియరీ పరీక్షలకు సర్వం సిద్ధం చేశాం. ప్రాక్టికల్ పరీక్షలకు సైతం ఏర్పాట్లు పూర్తి కావచ్చాయి. జిల్లాలో ఒకేషనల్ కోర్సులున్న 46 జూనియర్ కళాశాలల్లో ఫిబ్రవరి 5 నుంచి 20 వరకు మూడు విడతల్లో ప్రాక్టికల్స్ పరీక్షలు జరుగుతాయి. జయీభవ కార్యక్రమం మంచి ఫలితాలను ఇస్తోంది.

– సైమన్ విక్టర్, ఆర్ఐఓ, ఒంగోలు



ఇంటర్ పరీక్షలకు సిద్ధమవుతున్నా

మార్కాపురంలోని సాధనా జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాను. సెకండియర్ సిలబస్‌తో పాటు నీట్ పరీక్షకు కూడా ప్రిపేరవుతున్నాను. మార్కాపురంలో మెడికల్ కళాశాల పెడుతున్నారు. నీట్‌లో సీట్ వస్తే మార్కాపురంలోనే నేను ఎంబీబీఎస్ చదువుతాను.

– ఎస్ శ్రీలక్ష్మి, ఇంటర్ సెకండియర్ విద్యార్థిని

పేదల ఇళ్ల పట్టాలకు మార్గం సుగమం

- ఇళ్ల స్థలాలకు భూములిచ్చిన రైతులకు నగదు జమ
- పేదలకిచ్చిన మాటకు బాలినేని వేగవంతమైన చర్యలు
- 216 మంది రైతుల ఖాతాలకు రూ.126.34 కోట్లు అందజేత
- పచ్చ నేతల విష ప్రచారానికి తెర



ఒంగోలు అర్బన్: ఒంగోలులో పేదలకు 24వేల ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు మార్గం సుగమమైంది. ఎట్టి పరిస్థితుల్లోనూ పేదలకు పట్టాల పంపిణీ చేస్తానని మాట ఇచ్చిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ముఖ్యమంత్రితో మాట్లాడి భూములు సేకరణకు, ప్లాట్ల ఏర్పాటుకు అవసరమైన రూ.210 కోట్లను మంజూరు చేయించి నిధులను విడుదల చేయించిన విషయం తెలిసిందే. అయినా పచ్చ పార్టీ నేతలు పట్టాలు ఇస్తారనడం అబద్ధమంటూ విష ప్రచారం చేపట్టారు. అయితే ఇవేమీ పట్టించుకోకుండా ఇళ్ల పట్టాల పంపిణీపై దృష్టి సారించారు. అందులో భాగంగా కలెక్టర్ దినేష్‌కుమార్‌తో పాటు రెవెన్యూ అధికారులతో నిరంతరం ఇంటి పట్టాల పంపిణీపై తీసుకుంటున్న చర్యలపై ఆరా తీస్తూ పనులు వేగవంతం చేశారు. బుధవారం కలెక్టర్‌ను కలిసిన బాలినేని ఇళ్ల పట్టాల పంపిణీపై చర్చించారు. గురువారానికి పేదల ఇళ్ల స్థలాల కోసం భూములు ఇచ్చిన రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా నగదు జమ చేశారు. సుమారు 270 మంది రైతుల నుంచి మల్లేశ్వరపురం, ఎన్ అగ్రహారం, యరజర్ల, వెంగముక్కలపాలెం తదితర గ్రామాల్లో భూసేకరణ నిర్వహించారు. దీనికి సంబంధించి దాదాపుగా 435 ఎకరాల భూమిని సేకరించారు. ఆయా భూములకు సంబంధించి 216 మంది రైతులకు వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా రూ.126.34 కోట్లు జమ చేశారు. గతంలో ప్రభుత్వం విడుదల చేసి రూ.30 కోట్లు జమ చేయగా, గురువారానికి రూ.96.34 కోట్లు రైతుల ఖాతాల్లో జమయ్యాయి. మిగిలిన రూ.34.67 కోట్లలో భూములు ఇచ్చిన రైతులకు సంబంధించిన బ్యాంకు రుణాలు, స్టోన్ ప్లాంటేషన్, రోడ్లు తదితర పనులు చేపట్టనున్నారు. రైతుల నుంచి చేపట్టిన భూ సేకరణ పూర్తి కావడంతో ఆయా భూముల్లో ప్రభుత్వం అభివృద్ధి పనులు చేసేందుకు ఎటువంటి ఆటంకాలు లేకుండా తొలగిపోయాయి. పట్టాలు పంపిణీ చేసేందుకు అవసరమైన ప్లాట్ల ఏర్పాటు, రోడ్లు తదితర పనులను ఎప్పటికప్పుడు బాలినేని పర్యవేక్షిస్తున్నారు.

ఎస్పీగా పరమేశ్వరరెడ్డి

- తిరుపతికి మలికాగర్గ్
- ఎస్పీగా జిల్లాలో ప్రత్యేక సేవలు
- సెల్‌ఫోన్ల రికవరీలో మలికాగర్గ్‌కు ప్రత్యేక గుర్తింపు



పరమేశ్వరరెడ్డి



మలికాగర్గ్

ఒంగోలు సబర్బన్: జిల్లా ఎస్పీగా పి.పరమేశ్వరరెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రటరీ కేఎస్ జవహర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి ఎస్పీగా పనిచేస్తున్న పి.పరమేశ్వరరెడ్డిని జిల్లాకు బదిలీ చేసి ఇక్కడ పనిచేస్తున్న మలికాగర్గ్‌ను తిరుపతి ఎస్పీగా బదిలీ చేశారు. విజయవాడలో ఏఎస్పీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మలికాగర్గ్‌ను పదోన్నతిపై ఎస్పీగా ప్రభుత్వం జిల్లాకు బదిలీ చేసింది. బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్, మలికా గర్గ్‌లు దంపతులు. జిల్లాలో ఎస్పీగా మలికాగర్గ్ విశేష సేవలందించారు. సెల్‌ఫోన్ రికవరీలో ఆమె తీసుకున్న నిర్ణయాలు ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చాయి. గతంలో సెల్‌ఫోన్ పోతే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా తీసుకునే వారు కాదు. కానీ సెల్‌ఫోన్ పోతే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయండని ఎస్పీ మలికాగర్గ్ ఫోన్లు పోగొట్టుకున్న వారికి భరోసా ఇచ్చారు. దీంతో వేలాది సెల్‌ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అండగా నిలిచారు. జిల్లాలో ప్రవేశపెట్టిన సెల్‌ఫోన్ల రికవరీ కార్యక్రమాన్ని ఆ తరువాత రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేశారు. కోర్టు కేసుల విషయంలో గుడ్ ట్రయల్ మానిటరింగ్ చేపట్టి నిందితులకు పెద్ద ఎత్తున శిక్షలు పడేలా చర్యలు చేపట్టారు. కోర్టు కేసులను పరిశోధిస్తున్న సిబ్బందిని అప్రమత్తం చేసి పోక్సో కేసుల్లో కూడా 14 నుంచి 20 ఏళ్ల వరకు శిక్ష పడేవిధంగా, కేసు నమోదైన తక్కువ కాలంలోనే కేసు ట్రయల్ పూర్తి చేసి శిక్షలు పడేలా కృషి చేశారు. ప్రమాదాల నివారణ జిల్లాగా రాష్ట్రంలోనే జిల్లాకు గుర్తింపు తెచ్చేలా ప్రణాళిక చేపట్టారు. గ్రామ సచివాలయాల్లోని మహిళా పోలీసుల సాయంతో వేలాది మంది దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా చర్యలు చేపట్టారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో జిల్లాకు ఎన్నో అవార్డులు, రివార్డులు దక్కేందుకు ఆమె కృషి చేశారు. జిల్లాలోని హనుమంతునిపాడు పోలీస్‌స్టేషన్‌కు జాతీయస్థాయిలో ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా అవార్డు రావడంతో ఎస్పీ తీసుకున్న చర్యలే కారణం. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోనూ వలేటివారిపాలెం పోలీస్‌స్టేషన్‌కు సైతం ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా ఎంపికైంది.

కార్యకర్తనై పనిచేస్తా

- పార్టీ శ్రేణుల పరిచయ కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున



కార్యకర్తల పరిచయ కార్యక్రమంలో మాట్లాడుతున్న మేరుగ నాగార్జున

నాగులుప్పలపాడు: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా మరోసారి రెపరెపలాడడానికి తాను కూడా మీతో కలిసి కార్యకర్తలాగా పనిచేస్తానని సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున అన్నారు. మండల పరిధిలోని మద్దిరాలపాడు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన నాయకులు, కార్యకర్తల పరిచయ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ తాను మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాలం నుంచే వైఎస్సార్ కుటుంబానికి విధేయతతో పనిచేశానని, ఆ చొరవతోనే ఎన్నో సార్లు ఓటమి చెందినా ప్రతిసారి పోటీలో నిలవడానికి రాజశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారన్నారు. జిల్లాలో పార్టీ పెద్దలు, నాయకులతో పాటు బాలినేని శ్రీనివాసరెడ్డి ఆశీస్సులతో అందరినీ సమన్వయం చేసుకొని పార్టీని గెలిపించడంలో తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. నాయకుల మధ్య ఉన్న చిన్న చిన్న అంతరాలు తొలగించుకొని అందరం పార్టీ గెలుపు కోసం సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏ గ్రామంలో సమస్యనైనా తన దృష్టికి తీసుకువస్తే అవకాశం ఉన్నంత వరకు తప్పకుండా పరిష్కరిస్తానన్నారు. తాను తెలిసి ఎలాంటి తప్పులు చేయనని, ఒకవేళ తాను తప్పు చేస్తున్నానని కార్యకర్తకు అనిపించినా తన దృష్టికి తీసుకువస్తే సరిచేసుకొని అందరినీ సమన్వయం చేసుకొని ముందుకు వెళతానన్నారు. అనంతరం గ్రామాల వారీగా నాయకులు, కార్యకర్తలు మేరుగ నాగార్జునను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ముందుగా మండల పార్టీ కార్యాలయాన్ని పునః ప్రారంభించారు. మాదిగ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇనగంటి పిచ్చిరెడ్డి, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలమలపు కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, పీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ పెనుబోతు రంగారావు, పరంధామిరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్లు పేరాల చెన్నకేశవులు, కొలకలూరి విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీ మల్లెల జాన్సన్, కూనం పూర్ణచంద్రరావు, పోలినేని కోటేశ్వరరావు, కొంజేటి సురేష్, మాదాసు రాంబాబు, త్రినాథ్‌రెడ్డి, కాట్రగడ్డ శ్రీను, ఓబుల్‌రెడ్డి, వైకుంఠ వీరాంజనేయులు, కుమ్మారి సుధాకర్, పాలేరు నాగేశ్వరరావు, ఘట్టమనేని అశోక్, కాటూరి ఆదియ్య, కందుల డానియేలు, సురేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ టారిఫ్‌లో మార్పు లేదు

- ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ముగిసిన బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ
- విలేకరుల సమావేశంలో ఎస్‌ఈ సత్యనారాయణ స్పష్టం

ఒంగోలు సబర్బన్: విద్యుత్ టారిఫ్‌ల్లో ఎలాంటి మార్పులు లేవని ఉమ్మడి ప్రకాశం జిల్లా ఏపీసీపీడీసీఎల్ ఎస్‌ఈ కేవీజీ సత్యనారాయణ అన్నారు. స్థానిక విద్యుత్ భవన్‌లో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. విద్యుత్ వినియోగదారుల కోసం జనవరి 29వ తేదీ నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టామన్నారు. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ రెగ్యులేటరీ కమిషన్(ఏపీఈఆర్‌సీ) ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాలను చేపట్టామన్నారు. నాలుగు రోజుల పాటు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఆయా కార్యాలయాల్లో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టామన్నారు. అభ్యంతరాలు తెలియజేసేందుకు ఏపీఈఆర్‌సీ వెబ్‌సైట్, ఏపీసీపీడీసీఎల్ వెబ్‌సైట్లలో పేర్లు నమోదు చేసుకున్న వారు బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్నారని వెల్లడించారు. ఆన్‌లైన్ ద్వారా నేరుగా 70 మంది, ఆఫ్‌లైన్ ద్వారా 32 పేర్లు నమోదు చేసుకొని బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్నారని తెలిపారు. ప్రధానంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డిస్కం ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై అభిప్రాయాలను తెలియజేశారన్నారు. ఏపీఈఆర్‌సీ రెగ్యులేషన్ కమిషన్ ప్రకారం ప్రతి సంవత్సరం ప్రభుత్వ యాజమాన్యంలోని డిస్ట్రిబ్యూషన్ లైసెన్స్ కలిగిన విద్యుత్ పంపిణీ సంస్థలు ఏపీఈఆర్‌సీకి రానున్న ఆర్థిక సంవత్సరానికి అవసరమైన టారిఫ్ ప్రతిపాదనలను ఈపీఈఆర్‌సీకి సమర్పిస్తారన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన టారిఫ్ ప్రతిపాదనలను 2023 నవంబర్ 30న సమర్పించామని వెల్లడించారు. అయితే ఇప్పటి వరకు ఉన్న విద్యుత్ టారిఫ్‌లో ఎలాంటి మార్పులు లేకుండా అదే టారిఫ్‌ను రానున్న ఆర్థిక సంవత్సరంలో కూడా అమలు చేస్తుండటంతో విద్యుత్ వినియోగదారులు సంతోషం వ్యక్తం చేశారన్నారు. దేశంలో మొత్తం 10 డిస్కంలకు ఎ రేటింగ్ ఇస్తే అందులో మన రాష్ట్రానికి చెందినవి మూడు డిస్కంలు ఉండటం మంచి పరిణామమన్నారు. సాధ్యమైనంత వరకు నాణ్యమైన విద్యుత్‌ను అందించటంతో పాటు కోతలు లేకుండా చూస్తున్నామని వివరించారు.

జిల్లాలో భారీగా పోలీస్ అధికారుల బదిలీలు

- పలువురు డీఎస్పీలకు స్థానచలనం
- ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి భీమవరం బదిలీ
- ఒంగోలు డీఎస్పీగా కిషోర్ బాబు
- రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం నిర్ణయం

ఒంగోలు సబర్బన్: జిల్లాలో పెద్ద ఎత్తున పోలీస్ అధికారుల బదిలీ అయ్యారు. ఇప్పటికే కొందరు సీఐలు, ఎస్సైల బదిలీలు చేపట్టగా తాజాగా జిల్లాలో పనిచేస్తున్న పలువురు డీఎస్పీలు, ఆర్మ్‌డ్ రిజర్వు డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లను, లా అండ్ ఆర్డర్ ఎస్సైలను బదిలీ చేస్తూ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎస్పీ మలికాగర్గ్‌లు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రానున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు రాష్ట్ర పోలీస్ అధికారులు భారీ స్థాయిలో అధికారుల బదిలీలను చేశారు. అందులో భాగంగా ఒంగోలు, మార్కాపురం డీఎస్పీలతో పాటు ఆర్మ్‌డ్ రిజర్వులో పనిచేస్తున్న డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లను, పీటీసీ, డీటీసీల్లో పనిచేస్తున్న డీఎస్పీలను బదిలీ చేశారు. ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డిని భీమవరం డీఎస్పీగా బదిలీ చేశారు. ఒంగోలు డీఎస్పీగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పనిచేస్తున్న ఎం.కిషోర్‌బాబును నియమించారు. ఒంగోలు పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో డీఎస్పీగా పనిచేస్తున్న ఎం.సుధాకరరావును పల్నాడు జిల్లా దిశ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. గుంటూరు ఎస్‌బీ డీఎస్పీగా పనిచేస్తున్న తుపాకుల వెంకట రత్నస్వామిని ఒంగోలు దిశ పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా, ఎన్‌టీఆర్ పోలీస్ కమిషనరేట్‌లోని సైబర్ క్రైమ్‌లో డీఎస్పీగా పనిచేస్తున్న సీహెచ్ శ్రీనివాసరావును ఒంగోలు దిశ పోలీస్‌స్టేషన్‌కు, ఒంగోలు దిశ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావును బాపట్ల క్రైం డీఎస్పీగా, ఒంగోలు ట్రాఫిక్ డీఎస్పీగా వి.శ్రీనివాసరావును ఒంగోలు పీటీసీకి, కందుకూరు డీఎస్పీగా పనిచేస్తున్న ఏ.రామచంద్రను ప్రకాశం ఎస్‌బీ డీఎస్పీగా నియమించారు.

భారీస్థాయిలో ఎస్సైల బదిలీలు

జిల్లాలో భారీ ఎత్తున ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ మలికాగర్గ్ ఉత్తర్వులు జారీ చేశారు. త్రిపురాంతకంలో పనిచేస్తున్న బి.సుదర్శన్‌ను యర్రగొండపాలేనికి, అక్కడ పనిచేస్తున్న ఎంవీ రాజేష్‌ను పొన్నలూరుకు, అక్కడ పనిచేస్తున్న వి.సాంబశివయ్యను త్రిపురాంతకానికి, వీఆర్‌లో ఉన్న టి.త్యాగరాజును కనిగిరికి, అక్కడ పనిచేస్తున్న కె.మాధవరావును కొనకనమిట్లకు, అక్కడ పనిచేస్తున్న బి.బ్రహ్మనాయుడును నాగులుప్పలపాడుకు బదిలీ చేశారు. ఒంగోలు వీఆర్‌లో ఉన్న పి.సురేష్‌ను కొండపికి, అక్కడ పనిచేస్తున్న వై.నాగరాజును ముండ్లమూరుకు, అక్కడ పనిచేస్తున్న యు.వి.కృష్ణయ్యను చీమకుర్తికి బదిలీ అయ్యారు. ఒంగోలు వీఆర్‌లో పనిచేస్తున్న ఎం.శివను వెలిగండ్లకు, ఒంగోలు వీఆర్‌లో ఉన్న ఎల్.సంపత్‌కుమార్‌ను దొనకొండకు, అక్కడ పనిచేస్తున్న ఎం.సైదుబాబును పామూరుకు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న ఏ.నాగేశ్వరరావును టంగుటూరుకు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న జి.శివన్నారాయణను దర్శికి, ఒంగోలు వీఆర్‌లో ఉన్న ఆర్.సుమన్‌ను కురిచేడుకు, ఒంగోలు వీఆర్‌లో ఉండి ప్రస్తుతం ఒంగోలు తాలూకాలో పనిచేస్తున్న యు.పున్నారావును ఒంగోలు దిశ పీఎస్‌కు, ఒంగోలు వీఆర్‌లో ఉన్న ఎస్‌కే.అబ్దుల్ రహమాన్‌ను మార్కాపురం టౌన్‌కు, ఒంగోలు వీఆర్‌లో ఉన్న కేవీ.కోటేశ్వరరావును కొమరోలుకు, ఒంగోలు వీఆర్‌లో ఉన్న జి.వెంకట సైదులును పెదారవీడుకు, వీఆర్‌లో ఉన్న టి.రమేష్‌బాబును పీసీపల్లికి, గిద్దలూరులో పనిచేస్తున్న వి.మహేష్‌ను ఒంగోలు దిశ పీఎస్‌కు, ఒంగోలు దిశ పీఎస్‌లో పనిచేస్తున్న ఎండీ.ఫిరోజ్ ఫాతిమాను పుల్లలచెరువుకు, వీఆర్‌లో ఉన్న టి.కిషోర్‌బాబును ఒంగోలు వన్‌టౌన్‌కు, వీఆర్‌లో ఉన్న వి.ప్రేమయ్యను ఒంగోలు టూటౌన్‌కు, వీఆర్‌లో ఉన్న కె.శివప్రసాదరావును ఒంగోలు వన్‌టౌన్‌కు, వీఆర్‌లో ఉన్న ఎం.కృష్ణబాజీబాబును ఒంగోలు టౌన్‌కు, వీఆర్‌లో ఉన్న ఏ.రఘుపతిరావును ఒంగోలు టూటౌన్‌కు, వీఆర్‌లో ఉన్న ఎం.విజయ్‌కుమార్‌ను ఒంగోలు తాలూకా పీఎస్‌కు, కె.వెంకటేశ్వరరావును ఒంగోలు తాలూకా పీఎస్‌కు,



ఆర్ఎం.విజయ్ కుమార్‌ను ఒంగోలు ట్రాఫిక్ పీఎస్‌కు, వీఆర్‌లో ఉన్న పి.వెంకటేశ్వర్లును ఒంగోలు దిశ పీఎస్‌కు బదిలీ చేశారు. ఒంగోలు వీఆర్‌లో ఉన్న స్పందన అటాచ్డ్‌లో ఉన్న ఎస్సై కె.మధుసూదన్‌రావును పోలీస్ కంట్రోల్ రూమ్‌కు, కె.విజయకుమార్‌ను పోలీస్ కంట్రోల్ రూంకు, ఒంగోలు వీఆర్‌లో ఉండి ప్రస్తుతం తాలూకాలో పనిచేస్తున్న ఈ.అంకమ్మను సీసీఎస్‌కు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న పి.నాగేశ్వరరావు, బి.బాలూనాయక్, సీహెచ్ వెంకటేశ్వర్లు, టి.వెంకటేశ్వరరావులను ఒంగోలు సీసీఎస్‌కు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న ఈ.రమాదేవి, జి.శివప్రసాద్‌లను ఒంగోలు డీసీఆర్‌బీకి బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న వి.ఆంజనేయులు, వీఎస్.రాజేశ్వరీదేవి, కె.శ్రీనివాసరావు, టీసీ కృష్ణయ్య, ఎం.జ్ఞానశేఖర్, ఎం.వేణుగోపాల్ జిల్లా ఎస్‌బీకి బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న పి.మంత్రునాయక్‌ను డీటీఆర్‌బీకి, పి.సుబ్రహ్మణ్యంను ఫాక్షన్ జోన్‌కు, కె.బాబును డీటీసీ ఒంగోలుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్మ్‌డ్ రిజర్వులో బదిలీలు...

గుంటూరు జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వులో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ ఎస్.రమేష్‌కృష్ణన్‌ను ప్రకాశం ఆర్మ్‌డ్ రిజర్వు(డీఏఆర్)కు, పల్నాడు డీఏఆర్‌లో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీ రమణారెడ్డిని ప్రకాశం ఏఆర్‌కు బదిలీ చేశారు. ప్రకాశం డీఏఆర్‌లో పనిచేస్తున్న జి.శ్రీహరిరెడ్డిని గుంటూరు డీఏఆర్‌కు, ఎస్‌కే.ఖాశింను సీఏఆర్ విజయవాడ సిటీకి బదిలీ చేస్తూ పోలీస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు.

క్లుప్తంగా

నేడు కొండపి నియోజకవర్గంలో మంత్రి సురేష్ పర్యటన

టంగుటూరు: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శుక్రవారం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 9:30 గంటలకు మర్రిపూడి మండలం పృథులగిరి ఫూట్ రోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మర్రిపూడి నుంచి బయలుదేరి 11 గంటలకు ఒంగోలులో జిల్లా అవతరణ దినోత్సవానికి హాజరవుతారు. మధ్యాహ్నం 12 గంటలకు కొండపిలో, సాయంత్రం 3 గంటలకు జరుగుమల్లిలో నిర్వహిస్తున్న వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీలో పాల్గొంటారు. తదనంతరం జరుగుమల్లి నుంచి బయలుదేరి రాత్రికి ఒంగోలులోని క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారని మంత్రి కార్యాలయ ప్రతినిధి ఓ ప్రకటనలో వివరించారు.

పోతవరంలో పోలియో అనుమానిత కేసు!

- పోలియో సోకలేదని నిర్ధారణ



చిన్నారిని పరిశీలిస్తున్న డాక్టర్ మోనికా స్టేపీ థామస్

దర్శి: మండలంలోని పోతవరం గ్రామంలో అనుమానిత పోలియో కేసును ప్రపంచ ఆరోగ్య సంస్థ వైద్య బృందం గురువారం పరిశీలించింది. మెడికల్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు, సీహెచ్ఓ దయమనితో కలిసి డాక్టర్ మోనికా స్టేపీ థామస్ చందలూరులో చిన్నారి నివాసానికి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించారు. చిన్నారికి పోలియో లేదని నిర్ధారించారు.

గృహోపకరణాలు దగ్ధం

కంభం: పట్టణంలోని ఓ గృహంలో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో సామగ్రి దాదాపు దగ్ధమైంది. స్థానిక శీలం వీధిలోని జానీ బాషా గృహంలో గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలు అదుపుచేసే లోపే గృహోపకరణాలు, దుస్తులు కాలిపోయాయి. సుమారు రూ.లక్ష మేర ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపక సిబ్బంది చెప్పారు.

మహిళల సంక్షేమమే ధ్యేయం

- సీఎం జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో అందరికీ లాభం
- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ
- నాలుగో విడత రుణమాఫీ రూ.4.52 కోట్లు చెక్కుల పంపిణీ



మహిళలకు ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న బూచేపల్లి కుటుంబం

దొనకొండ: నవరత్నాల్లో భాగంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, మరలా ఆయన్ను ముఖ్యమంత్రిని చేసేందుకు మహిళలు కలిసికట్టుగా పని చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ శాసన సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో గురువారం మహిళలకు వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగో విడత రుణమాఫీ రూ.4.52 కోట్లు చెక్కులను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ జగనన్న పాదయాత్రలో అక్క చెల్లెమ్మల కష్టాలు తెలుసుకున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో మహిళలను చంద్రబాబునాయుడు మోసం చేశారని, అలాంటి బాబును 2024 ఎన్నికల్లో తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. టీడీపీ ప్రభుత్వంలో ప్రజలు పనుల నిమిత్తం కార్యాలయాల చుట్టూ తిరగవలసి వచ్చిందని, నేడు సచివాలయాలు, ఆర్‌బీకేలు, క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రయోజనాలు చేకూర్చుతున్నారన్నారు. నాడు జన్మభూమి కమిటీ సభ్యులు కమిషన్‌లు వసూలు చేస్తున్నారని, జగనన్న అలా కాకుండా రైతులకు, విద్యార్థులకు, మహిళలకు, రైతు భరోసా, అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన నేరుగా తల్లుల ఖాతాల్లో జమ చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని గుర్తు చేశారు. మహిళలకు 30 లక్షల ఇళ్లులు కట్టించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. 2004లో తమ తండ్రి బూచేపల్లి సుబ్బారెడ్డి ఇండిపెండెంట్ అభ్యర్థిగా దర్శి నియోజకవర్గ ప్రజలు అధిక మెజార్టీతో గెలిపించారని శివప్రసాద రెడ్డి అన్నారు. దొనకొండ ప్రాంతాన్ని అభివృద్ధి బాటలో ఆయన నడిపించారని తెలిపారు. జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.50 లక్షలతో మహిళా భవనం నిర్మాణానికి మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించి 623 గ్రూపుల్లో 6214 సభ్యులకు రూ.4.52 కోట్లు విలువైన చెక్కులను మహిళలకు అందజేశారు. జగనన్న చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో నా బిడ్డ బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని, తమ కుటుంబం మీ అందరికీ తెలుసని, ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మండల ప్రజలను కోరారు.

దొనకొండ ప్రాంతాన్ని పరిశ్రమల హబ్‌గా ఏర్పాటు చేస్తాం

దొనకొండ ప్రాంతంలో రైతులు పండిన పంటను స్టోర్ చేసుకోవడానికి కోల్డ్ స్టోరేజీ, నిరుద్యోగ సమస్య నిర్మూలనకు, ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుతో హబ్ కోసం తమ వంతు కృషి చేస్తామని ప్రజలకు శివప్రసాదరెడ్డి హామీ ఇచ్చారు. 'శివన్నా మా దొనకొండ మండలానికి నీటి సమస్య ఉంది. చందవరంలో 2, లక్ష్మీపురంలో 1 సమ్మర్ స్టోరేజీలు గతంలో నిర్మించారు. పైపులైన్ మరమ్మతులు కారణంగా మంచి నీరు సరఫరా కావటం లేదు. అంతేకాకుండా దొనకొండ వాసులకు ఇంటింటికీ నీటి వసతి ఏర్పాటు చేయాలి. ఉపాధి లేక నిరంతరం ప్రజలు వలస వెళ్తున్నారు. ఈ ప్రాంతాన్ని కారిడార్‌గా ఏర్పాటు చేయాలి' అని ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి కోరారు.



జగనన్న చిత్ర పటానికి పాలాభిషేకం

ప్రత్యేక పూజలు

తొలుత స్థానిక అద్దరోడ్డులోని ఆనంద ఆశ్రమం శివాలయంలో బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ గ్రేస్‌రత్నకుమారి దేవానంద్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. శివప్రసాదరెడ్డి సతీమణి నందిని, కాపా రమణారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ టి.వసుంధర, ఏరియా కోఆర్డినేటర్ వసుంధరాదేవి, ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, స్థానిక సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి దేవానంద్, తహసీల్దార్ యం.సువర్ణ, ఎంపీడీఓ వి.వసంతరావునాయక్, ఏపీఎం జి.వెంకటేశ్వర్లు, కాకర్ల క్రిష్ణారెడ్డి, కర్నాటి ప్రసన్నాంజనేయరెడ్డి, నూనె సరోజా వెంకటరెడ్డి, బాపనపల్లి మంగమ్మ, రాచగొర్ల బోడయ్య, వజ్రగిరి రాణి, యామిని బాలిరెడ్డి, గుంటు అమ్మాజీ అజయ్, బండారు రాజు, తాల్లూరి లక్ష్మి, పాతకోట కోటమ్మ, పత్తికొండ వెంకటసుబ్బయ్య, కర్నాటి సునీత, పాతకోట సునీత, దేవండ్ల వెంకటసుబ్బయ్య, బత్తుల వెంకటసుబ్బయ్య యాదవ్, ఐలూరి శ్రీనివాసరెడ్డి, తమ్మనేని సుబ్బారెడ్డి, జొన్నకూటి సుబ్బారెడ్డి, పి.బాలకోటిరెడ్డి, పిల్లి ఓబులరెడ్డి, గొంగటి పోలిరెడ్డి, వెన్నపూస చెంచిరెడ్డి, పి.మూర్తెయ్య, కప్పురం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ జమానాలో
విద్యా వ్యవస్థ నాశనం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న తాటిపర్తి చంద్రశేఖర్

- చైతన్య, నారాయణ స్కూళ్లను పెంచి పోషించిన చంద్రబాబు
- పేద వర్గాలకు విద్యను అందుబాటులోకి తెచ్చిన జగనన్న
- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: టీడీపీ పాలనలో విద్యా వ్యవస్థను నాశనం చేశారని, చైతన్య, నారాయణ స్కూళ్లను చంద్రబాబు పెంచి పోషించారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ ధ్వజమెత్తారు. గురువారం స్థానిక త్రిపురాంతకం రోడ్డులోని వైష్ణవి గార్డెన్స్‌లో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి అధ్యక్షత వహించారు. తాటిపర్తి మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేద పిల్లలు ఉన్నత చదువులు చదవాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్ది, ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. పిల్లల చదువులు తల్లిదండ్రులకు భారం కాకుండా అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశపెట్టి ఏటా తల్లుల ఖాతాల్లో రూ.15 వేలు జమ చేస్తున్నారని, నాణ్యమైన పుస్తకాలు, యూనిఫాం ఉచితంగా అందిస్తున్నారన్నారు. విదేశాలకు వెళ్లి ఉన్నత చదవులు చదివే వారికి జగనన్న విదేశీ విద్యా దీవెనతో చేయుతనిస్తున్నారని తెలిపారు.

అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు

సీఎం వైఎస్ జగన్ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన అవ్వాతాతలకు పింఛన్లు అందిస్తున్నారని, వారి ఆశీర్వచనాలే జగనన్నకు శ్రీరామ రక్ష అని పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను 99 శాతం అమలు చేసి ప్రజాభిమానాన్ని చూరగొన్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల పేరుతో జన్మభూమి కమిటీలు దోపిడీ చేశాయని నిప్పులు చెరిగారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో 30 లక్షల మందికి పింఛన్లు ఇచ్చి చేతులు దులుపుకొన్నారని, ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం 65 లక్షల మందికి పింఛన్లు అందిస్తోందని వివరించారు.

అన్ని పార్టీలతో బాబు పొత్తు

టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఓడిపోతామనే భయంతో రాష్ట్రంలోని అన్ని పార్టీలతో పొత్తులు పెట్టుకుంటున్నారని విమర్శించారు. ఆయన ఎన్ని పార్టీలతో మిలాఖత్ అయినా మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధమయ్యారన్నారు. 2019కి ముందు రాష్ట్రాన్ని గుల్ల చేసిన టీడీపీని ప్రజలు గల్లంతు చేశారని, 175 అసెంబ్లీ స్థానాలకుగాను కేవలం 23 సీట్లకే పరిమితం చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేయడానికి జగనన్న సైన్యం సిద్ధం కావాలన్నారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు ఒంగోలు మూర్తిరెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ దుగ్గెంపూడి వెంకటరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, త్రిపురాంతకేశ్వర దేవస్థానం చైర్మన్ ఇమ్మడిశెట్టి వెంకటసుబ్బారావు, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష, మండల పరిషత్ వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు, కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు మేడగం వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు చేదూరి కన్నా, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, ఏఎంసీ డైరెక్టర్లు కె.జయరావు, కందుల సత్యనారాయణ, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు,వైఎస్సార్ సీపీనాయకులు పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదరిక నిర్మూలన

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- వేములకోటలో నూతన ఆర్బీకేలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు ప్రారంభం
- హాజరైన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి



ఆర్‌బీకేలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, జంకె వెంకటరెడ్డి

మార్కాపురం రూరల్: నవరత్నాలు పథకాలతో పేదరికం లేని సమాజ స్థాపనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి స్పష్టం చేశారు. గురువారం మండలంలోని వేములకోటలో రూ.86 లక్షలతో నిర్మించిన రెండు నూతన ఆర్బీకే భవనాలు, రెండు వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ప్రజల ఇంటివద్దకే పాలన అందించేందుకుగాను 15 వేల నూతన గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి 1.36 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించారని వివరించారు. 4 లక్షల మంది వలంటీర్లను నియమించి అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ప్రజారంజక పాలనను ఇతర రాష్ట్రాలు సైతం ఆదర్శంగా తీసుకున్నాయన్నారు. అవినీతికి తావులేకుండా డీబీటీ పద్ధతిలో నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికీ విద్య, వైద్యం అందించాలనే ధృడ సంకల్పంతో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఆర్‌బీకేలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ప్రారంభించారు.

కార్యక్రమంలో ఎంపీపీ పోరెడ్డి అరుణా చెంచిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నారుబాపన్‌రెడ్డి, సర్పంచ్ గుంజా రాజేశ్వరి, ఎంపీటీసీ వీరయ్య, కొండేపల్లి ఎంపీటీసీ కుందురు మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ గాయం నాగేంద్రరెడ్డి, కొలగట్ల శివారెడ్డి, తంగిరాల యాకోబు, చెన్నయ్య, కోటిరెడ్డి, హనుమయ్య, గురవయ్య, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, జంకె వెంకటనారాయణరెడ్డి, ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఈఓఆర్‌డీ రామ్మోహన్‌రెడ్డి, తిప్పాయిపాలెం మెడికల్ ఆఫీసర్ రోహిత్‌నాయక్, నాగేంద్రరెడ్డి, పిఆర్ఎఈ మోహన్‌రాజు, పంచాయతీ సెక్రటరీ నారాయణరెడ్డి, రేవతి, ఆర్‌బీకే సిబ్బంది పల్లా శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి లక్ష్మానాయక్
- ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణలయ్యేలా సిబ్బంది కృషిచేయాలని సూచన



జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న లక్ష్మానాయక్

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో ఎస్సీ వసతి గృహాల్లో ఉంటూ విద్యనభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించే విధంగా వార్డెన్లు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి ఎస్.లక్ష్మానాయక్ ఆదేశించారు. జిల్లాలోని ఎస్సీ సంక్షేమ వసతి గృహాల అధికారులతో గురువారం ఆయన జూమ్ కాన్ఫరెన్స్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ వసతి గృహాల్లో ట్యూటర్లను కూడా నియమించామని, విద్యార్థుల చదువుపై దృష్టి సారించాలని చెప్పారు. మంచి మార్కులతో ఉత్తీర్ణులైతే భవిష్యత్ ఎలా ఉంటుందో వివరించి స్ఫూర్తిని నింపాలని కోరారు. రోజూ సాధన టెస్టులు నిర్వహించి విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తయిన తర్వాత వారు ఎక్కడ చదువుతున్నారో వివరాలు సేకరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వసతి గృహాలకు వేసవి సెలవులు ఉండవని, ఫెయిలైన విద్యార్థులను ఉత్తీర్ణులయ్యేలా శిక్షణ ఇవ్వాలని చెప్పారు. వసతి గృహంలో 100 మందికి తగ్గకుండా విద్యార్థులు ఉండేలా ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. మెనూను సక్రమంగా అమలు చేయాలన్నారు. కార్యాలయ పర్యవేక్షకుడు మధుసూధన్‌రెడ్డి, సీనియర్ సహాయకులు మాలకొండయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరుగురు నిందితులకు రిమాండ్

మార్టూరు: విధి నిర్వహణలో అధికారులను అడ్డుకుని వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేసిన ఎనిమిది మందిలో ఆరుగురు నిందితులకు అద్దంకి అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి 14 రోజులు రిమాండు విధించినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం ఉదయం బందోబస్తు మధ్య అద్దంకి కోర్టుకు తరలించిన నిందితులను అర్ధరాత్రి 1:00 గంటల ప్రాంతంలో కేసును పరిశీలించిన జడ్జి వారికి 14 రోజుల పాటు రిమాండు విధించగా వారిని ఒంగోలు జైలుకు తరలించినట్లుగా తెలిపారు. గత మంగళవారం మార్టూరు గ్రానైట్ ఫ్యాక్టరీలో తనిఖీ నిమిత్తం వచ్చిన మైనింగ్, విజిలెన్స్ అధికారులను టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఆయన అనుచరులు అడ్డుకుని కారు డ్రైవర్ శ్రీనివాస్‌పై దాడి చేసిన సంగతి తెలిసిందే.

పచ్చాకు మహిళా కూలీ మృతి

- ట్రాక్టర్ తిరగబడటంతో విషాదం
- ఇద్దరికి గాయాలు



పచ్చాకు ట్రాలీ తిరగబడి మృతి చెందిన సుదర్శి శోభారాణి (40)

మద్దిపాడు: ట్రాక్టర్ తిరిగబడిన ఘటనలో కూలీ మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. ఈ విషాద ఘటన గురువారం మధ్యాహ్నం మద్దిపాడు సమీపంలోని పొలాల్లో జరిగింది. రాచవారి పాలెంకు చెందిన గద్దం చెన్నారావు మద్దిపాడు సమీపంలో పొలం కౌలుకు తీసుకుని పొగాకు పంట వేశాడు. ఈ క్రమంలో రాచవారి పాలెంకు చెందిన ముఠా పచ్చాకు కొట్టుడుకు గురువారం ఉదయం వెళ్లింది. పచ్చాకును ట్రాక్టర్ ట్రాలీలో వేసుకుని 6 మంది కూలీలు బ్యారన్ వద్దకు వెళ్లడానికి అదే ట్రాక్టర్ ఎక్కారు. గురవారెడ్డిపాలెం, వెల్లంపల్లి మధ్య ఉన్న డొంక దారిలో వెళుతుండగా ఒక్కసారిగా ట్రాలీ గుంతలో తిరగబడిపోయింది. దీంతో సుదర్శి శోభారాణి (40) పచ్చాకు కింద పడి ఘటనా స్థలంలోనే మృతి చెందింది. అలాగే కూలీలు యాదాల మాలెమ్మ, పోగుల మూడి శుభాంజనేయులుకు స్వల్ప గాయాలయ్యాయి. మృతురాలిని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. శోభారాణికి ఒక కుమారుడు ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తెకు సంవత్సరం క్రితం వివాహం చేశారు. తమతో కొద్దిసేపటి వరకు కబుర్లు చెబుతున్న శోభారాణి విగత జీవిగా మారడంతో ముఠా కూలీలు, విచారం వ్యక్తం చేశారు. రాచవారిపాలెం పల్లెలో విషాద ఛాయలు నెలకొన్నాయి. మద్దిపాడు ఎస్ఐ శ్రీకాంత్ ఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'పాల్' కార్యక్రమంపై సమీక్ష

- 5 పాఠశాలలకు ప్రశంస పత్రాలు



ప్రశంస పత్రాలు అందిస్తున్న పాల్ అలెక్స్, ఇతర అధికారులు

ఒంగోలు అర్బన్: జిల్లాలోని 60 పాఠశాలల్లో జరుగుతున్న పర్సనలైజ్డ్ అడప్టివ్ లెర్నింగ్ (పాల్) కార్యక్రమంపై కొలంబియా యూనివర్శిటీ నుంచి వచ్చిన పాల్ అలెక్స్, శరత్, కమిషనర్ కార్యాలయం నుంచి పాల్ ల్యాబ్ స్టేట్ కోఆర్డినేటర్ కిషోర్ గురువారం ప్రకాశంభవనంలో హెచ్‌ఎంలతో సమీక్ష నిర్వహించారు. పాల్ ల్యాబ్ ఎక్కువగా వినియోగించి, ప్రతిభ చూపిన 5పాఠశాలల హెచ్‌ఎంలకు ప్రశంస పత్రాలు అందించారు. దీని ఆవశ్యకత, వినియోగించడం వల్ల పిల్లల తెలివితేటలు ఏవిధంగా పెరుగుతాయో వివరించారు. ప్రశంస పత్రాలను పామూరు మండలం మార్కొండాపురం, టంగుటూరు మండలం వల్లూరు జెడ్పీహెచ్ఎస్, మద్దిపాడు మండలం ఇనమనమెళ్లూరు, మర్రిపూడి జెడ్పీహెచ్ఎస్, మద్దిపాడు ప్రభుత్వ పాఠశాలలు న్నాయి. డీఈఓ సుబ్బారావు, ఏపీఓ మాధవీలత, డీఎస్ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

- డీఆర్‌డీఏ పీడీ వసుంధర



వెలుగు సిబ్బందితో రివ్యూ సమావేశం నిర్వహిస్తున్న పీడీ వసుంధర

ఒంగోలు సిటీ: జిల్లాలోని వెలుగు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి.వసుంధర అన్నారు. డీఆర్‌డీఏ కార్యాలయంలో గురువారం జిల్లాలోని వెలుగు సిబ్బంది సీసీలు, ఏపీఎంలు, డీపీఎంలు, ఏరియా కోఆర్డినేటర్లతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ వసుంధర మాట్లాడుతూ వీఓ మీటింగ్‌లు సక్రమంగా జరిగేలా సిబ్బంది బాధ్యత తీసుకోవాలన్నారు. సీసీలు ప్రతి నెలా రెండు సార్లు వీఓ సమావేశం నిర్వహించి అన్ని విషయాలను సమగ్రంగా చర్చించి అందుకు సంబంధించిన నివేదికలు, ఫొటోలు జిల్లాకు పంపించాలన్నారు. ముఖ్యంగా రికవరీలపై ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని, రికవరీ విషయంలో జిల్లా బాగా వెనకబడి ఉందన్నారు. డైరీ యూనిట్ మండలం టార్గెట్ ప్రకారం గ్రౌండ్ చేయాలని, అందుకు తగ్గట్టు ప్లాన్ చేసుకోవాలన్నారు. వైఎస్సార్ ఆసరా కార్యక్రమం పూర్తిగా మండలాల్లో ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం జరగాలన్నారు. వైఎస్సార్ ఆసరా పూర్తిగా మహిళలకు సంబంధించిన కార్యక్రమమైనందున వైఎస్సార్ ఆసరా అందుకునే ప్రతి మహిళ కార్యక్రమాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. వైఎస్సార్ చేయూత కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఏ ఒక్కస్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించినా వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉన్నతి, స్త్రీనిధి టార్గెట్, అచీవ్‌మెంట్‌పై ప్రత్యేకంగా రివ్యూ చేశారు. సమావేశంలో జిల్లాలోని వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.